క్లుప్తంగా

పిడుగుపాటుకు గడ్డివాముల దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాములు

శింగనమల: ఉల్లికల్లు గ్రామంలో శుక్రవారం రాత్రి పిడుగుపాటుకు మూడు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామంలోని శివారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రామాంజులరెడ్డి రైతులు గడ్డి వాములు గ్రామం చివరిలో ఉన్నాయి. శుక్రవారం రాత్రి పిడుగు పడడంతో గడ్డి వాములకు నిప్పు అంటుకుంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పాడానికి ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. పశుగ్రాసం పూర్తిగా కాలిపోయిందని రైతులు వాపోయారు.

యాచకులకు పాదరక్షలు, గొడుగుల పంపిణీ



యాచకులకు పాదరక్షలు, గొడుగులు అందిస్తున్న బాణా నాగేశ్వరరెడ్డి

తాడిపత్రి టౌన్: స్థానిక చింతల వెంకటరమణ స్వామి ఆలయ ఆవరణలో శనివారం ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు యాచకులకు పాదరక్షలు, గొడుగులను పంపిణీ చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని యాచకులకు పాదరక్షలు, గొడుగులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం యాచకులకు స్వామి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సంజన్న, భూమా హరి, మధ్యాల లత, నారాయణమ్మ, రమాదేవి, భక్తులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పుట్లూరు: చెర్లోపల్లి గ్రామ సచివాలయాన్ని శనివారం ఎంపీడీఓ యోగానందరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ పరిధిలో సిటిజెన్ ఔట్ రీచ్ కార్యక్రమం, హౌసింగ్, ఈకేవైసీ తదితర కార్యక్రమాల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని జగనన్న లేఔట్‌లో పీఎంఏవై కింద నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మూలి వెంకటరామిరెడ్డి, హౌసింగ్ ఏఈ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.


కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కు అందిస్తున్న కమాండెంట్ జగదీష్

బుక్కరాయసముద్రం: జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ మద్దిలేటి కుటుంబానికి శనివారం బెటాలియన్ కమాండెంట్ జగదీష్ రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. మద్దిలేటి కుటుంబానికి రూ.లక్ష, విడో ఫండ్ కింద రూ.50 వేలు, ఇన్సిడెంటల్ చార్జెస్ కింద రూ.25 వేల చొప్పున చెక్కులను హెడ్‌కానిస్టేబుల్ భార్య జయలక్ష్మికి అందజేశారు. బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ఏఓ నాగభూషణమ్మ, సీసీఎస్ ఇన్‌చార్జ్ సురేష్, బెటాలియన్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య పాల్గొన్నారు.

జీవీపీ కాలనీలో హర్ష పర్యటన



మహిళతో సమస్య తెలుసుకుంటున్న హర్ష

తాడిపత్రి: గన్నెవారిపల్లి కాలనీలో వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి శనివారం పర్యటించారు. మంచినీటి సరఫరా, పారిశుధ్య పనుల నిర్వహణ, సచివాలయాల సిబ్బంది పని తీరు, వలంటీర్లు సక్రమంగా ఇళ్ల వద్దకు వచ్చి ప్రభుత్వ పథకాల తీరుపై అవగాహన కల్పిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ రవికుమార్, ప్రభాకర్‌రెడ్డి, వంగనూరు సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దవడుగూరు: క్రిష్టిపాడులో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన దూదేకుల పీరా(57) వ్యవసాయ కూలీగా పని చేసేవాడు. కుటుంబ పోషణకు రూ.4 లక్షల దాకా అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై ఇంటి పైకప్పునకు ఉరేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, భార్య ఉన్నారు. మృతుడి భార్య దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

జగనన్న పాలన సువర్ణయుగం

- ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

తాడిపత్రి టౌన్: జగనన్న పాలన సువర్ణయుగాన్ని తలపిస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 32వ వార్డు శ్రీనివాసపురంలో శనివారం ఉదయం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. శ్రీనివాసపురంలోని మురగస్ కాంప్లెక్స్ వద్ద ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు స్వాగతం పలికారు. వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు పేరం ప్రతాపరెడ్డి, పేరం ఆదినారాయణరెడ్డి , గంగాధర్, నాగయ్యతో కలసి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని తెలియజేశారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను అందజేసి సీఎం జగనన్న ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగనన్నను ఆశీర్వదించాలని వృద్ధులు, మహిళలు, వికలాంగులు, యువకులను ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే వెంట ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచెం రామమోహన్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నే రాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జాన్సన్, కౌన్సిలర్లు రాఘవేంద్ర, చిన్ననాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు వదలయ్య, రంగనాథరెడ్డి, సాయి, నాయకులు నాగభూషణం, సునీల్, అన్వర్, హాజీవలి, బాబా,జావీద్, కృష్ణారెడ్డి, వేణు, లక్ష్మీరంగయ్య, కిట్టు, గడ్డం గణేష్ మున్సిపల్ డీఈ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. వైటీ.చెరువు గ్రామంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే తన కూతురు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డితో కలిసి గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించారు. వారికి మహిళలు అడుగడుగునా హారతులతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు తాను చెప్పిన ప్రతి మాటను, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్న జగనన్న సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావడమే కాకుండా, లక్షలమంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలను కల్పించారన్నారు. వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా ఇంటివద్దకే చేరుస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తూ ప్రజల కోసమే శ్రమిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు ప్రజలు అండగా నిలవాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ఎంపీడీఓ జాషువా, ఎంపీపీ బీవీ.మాధవి, వైస్ ఎంపీపీ చింబిలి ప్రభావతి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, కోఆప్షన్ సభ్యుడు సిపాయి బాషా, సర్పంచ్ సోనియా, ఎంపీటీసీ రామాంజినమ్మ, మండల కన్వీనర్ మోహన్ రావు, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు మద్దన్న, జయరామిరెడ్డి, మత్స్యకారుల సంఘం ప్రసిడెంట్ నరసప్ప, కార్యదర్శి ఆదినారాయణ, సీనియర్ నాయకుడు బెస్త గోపాల్, జయ్యన్న, దశరథ, గోవిందు, జాఫర్ వలి, నాగన్న, సచివాలయ కన్వీనర్ ఓబుళప్ప, పేరెంట్ కమిటీ చైర్మన్‌లు శంకరయ్య, ఈశ్వర్, నాయకులు కసాపురం మాజీ సర్పంచ్ తిక్కస్వామి, కొంగనపల్లి ఎంపీటీసీ హరి, పక్కీరప్ప, పెద్దొడ్డి పెద్దన్న, పుల్లన్న, షర్మాస్‌వలి, షేక్ మది పాల్గొన్నారు.

జగనన్నే మా నమ్మకం అనే భరోసా కల్పించాం

తాడిపత్రి: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ ప్రజలు గొంతెత్తి చాటుతున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శనివారం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7 న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. నియోజకవర్గంలో దాదాపు 81,832 గృహాలను సందర్శించి, 86.33 శాతాన్ని చేరుకోగలిగామన్నారు. అలాగే 60,458 మంది పార్టీ నంబర్‌కు మిస్ట్ కాల్ ఇప్పించామన్నారు. ప్రజల నుంచి విశేష లభించడంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై దాదాపు 90 శాతం మంది ప్రజలు కితాబులు ఇచ్చారన్నారు. వారందరికీ మా నమ్మకం నువ్వే జగన్ అనే భరోసాను ఈ కార్యక్రమం ద్వారా కల్పించడంలో గృహసారథులు, వార్డు కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకుల కృషి అభినందనీయమన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 90 శాతం మంది ప్రజలు మా భవిష్యత్తు నువ్వే జగన్ అంటూ ప్రభుత్వాన్ని కీర్తిస్తున్న వేళ, వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నిండుకుందని, ఇదే ఊపుతో ఇకపై నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకునేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

'జగనన్నే మా భవిష్యత్తు' విజయవంతం

- రూ.500 కోట్ల అభివృద్ధికి సీఎం హామీ
- శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

అనంతపురం క్రైం: శింగనమల నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతమైందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గృహసారథులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గంలో 82 శాతం ప్రజామద్దతు తెలిపిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. తమ పాలనలో జరిగిన మేలుతో పాటు లబ్ధిదారుల సమస్యలు ఇంకా ఏమైనా ఉంటే వాటికి పరిష్కారం చూపేందుకు ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందని, రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తామని చెబుతున్నారన్నారు.

రూ.500 కోట్ల అభివృద్ధికి సీఎం హామీ

శింగనమల నియోజకవర్గ అభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ చూపారని, రూ.500 కోట్ల అభివృద్ధి పనులకు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. చాగల్లు రిజర్వాయర్ ముంపు గ్రామాలైన ఉల్లికల్లు, ఉల్లికంటి ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.168 కోట్లు, ఈస్ట్ నరసాపురంలో రూ.35 కోట్లతో బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్, శింగనమలలో రూ.2 కోట్లతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ నిర్మాణం, రూ.3 కోట్లతో మిడ్‌పెన్నార్ డ్యాం నిర్వహణ, పుట్లూరు మండలంలో సాగు, తాగునీరు సమస్యను పరిష్కరించడానికి గండికోట రిజర్వాయర్ నుంచి సుబ్బరాయసాగర్ ట్యాంకు లిఫ్ట్ ద్వారా నీరందించే పథకానికి రూ.250 కోట్లు, తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎం ఆమోదం తెల్పిన విషయాలను తెలియజేశారు. ఎమ్మెల్యే గౌరవ పెంచేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న విప్లవాత్మక చర్యలకు ధన్యవాదాలు తెలిపారు.

నిరంతర అభివృద్ధి

నిరంతర అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, కాలువలు, సచివాలయాలు, డిజిటల్ లైబ్రరీలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని, భవిష్యత్తులో ప్రజావసరాలకనుగుణంగా ప్రతి ఇంటికి కొళాయి, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో బుక్కరాయసముద్రం ఎంపీపీ సునీత, సర్పంచ్ పార్వతి, జెడ్పీటీసీ నీలం భాస్కర్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్వీ నారాయణ, ఎస్సీ సెల్ నాయకులు మిద్దె కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు ఇంటింటా ఆదరణ



కొత్తపేటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ, నాయకులు

గుత్తి రూరల్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రతి ఇంటి వద్ద అపూర్వ ఆదరణ లభిస్తోందని వైస్ ఎంపీపీ సుద్దల తిరుపాలమ్మ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు సుద్దల రాముయాదవ్ పేర్కొన్నారు. కొత్తపేట గ్రామంలో శనివారం వలంటీర్లు, గృహసారథులతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ప్రతి ఇంటి వద్ద స్టిక్కర్లను అంటించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్, వెంకట్రాముడు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: తిమ్మాపురం, దోనిముక్కల, గుండాలతండా గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో కలిగిన ప్రజలకు కలిగిన లబ్ధిని వివరించారు.

యాడికి: ప్రజలంతా జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని లక్షుంపల్లె సర్పంచ పద్మనాభరెడ్డి అన్నారు. శనివారం లక్షుంపల్లెలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు జయరామిరెడ్డి, గోపాల రెడ్డి, బలరాముడు, రవికుమార్ రెడ్డి, రఘునాథరెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి, సురేంద్ర రెడ్డి విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి



గుంతకల్లుటౌన్: ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ, కమిషనర్

గుంతకల్లుటౌన్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న కోరారు. శనివారం దోనిముక్కల రోడ్డులోని జగనన్న లేఔట్లలో ఇళ్ల నిర్మాణ పనులను వారు పరిశీలించారు. మే నెలలో జరుగనున్న మెగా గృహ ప్రవేశాలకు సర్వం సిద్ధం చేయాలన్నారు. కాలనీల్లో మౌళిక సదుపాయాలను కల్పించాలని, చివరిదశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలని హౌసింగ్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులకు సూచించారు. ఇంజినీరింగ్, హౌసింగ్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: బ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ శాంతి పేర్కొన్నారు. శనివారం స్థానిక జగనన్న లేఅవుట్‌లో హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తోందన్నారు. తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ విజయ భాస్కర్, హౌసింగ్ ఏఈ విజయ భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు లబ్ధిదారులకు సూచించారు. కొత్తపేట గ్రామ శివారులోని జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఎంపీడీఓ హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రతి లబ్ధిదారు వద్దకు వెళ్లి ఇళ్ల నిర్మాణాల్లో ఉన్న సమస్యలను విచారించారు. కాలనీలో నీటి వసతి కల్పించాలని కొందరు లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

గుత్తి రూరల్: ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు లబ్ధిదారులకు సూచించారు. కొత్తపేట గ్రామ శివారులోని జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఎంపీడీఓ హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రతి లబ్ధిదారు వద్దకు వెళ్లి ఇళ్ల నిర్మాణాల్లో ఉన్న సమస్యలను విచారించారు. కాలనీలో నీటి వసతి కల్పించాలని కొందరు లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట, నేమతాబాద్, లచ్చానపల్లి, చెట్నేపల్లి లే అవుట్లలో శనివారం అధికారులు హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మహబూబ్ బాషా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఏఈ వెంకటేష్, సచివాలయ ఉద్యోగులు, నోడల్ అధికారులు, మెప్మా సీఈఓలు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం

పెద్దవడుగూరు: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు గాలీవాన బీభత్సం సృష్టించింది. కాశేపల్లి, విరుపాపురం, వీరన్నపల్లి, కొండూరు, చిత్రచేడు తదితర గ్రామాల్లో పండ్ల తోటలు, విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. దెబ్బ తిన్న పంటలను గుత్తి హార్టికల్చర్ అధికారి మిత్ర పరిశీలించారు. పంటల పరిశీలన కార్యక్రమంలో కాశేపల్లి సర్పంచ్ కృష్ణారెడ్డి, గుత్తిఅనంతపురం సర్పంచ్ మురళీధర్‌రెడ్డి రైతులు, అగ్రికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: గుత్తిలో శుక్రవారం అర్ధరాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఓ మోస్తరు వర్షంతో పాటు భారీ ఈదురు గాలులు వీయడంతో దాసరి కాలనీ, బీసీ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. విద్యుత్ స్తంభాలు పక్కనున్న ఇళ్లపై పడ్డాయి. ఆ సమయానికి జనాలు ఎవరూ బయట లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇదిలా ఉండగా పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద శనివారం ఓ లారీ రోడ్డు డివైడర్ మధ్యలో ఉన్న బటర్ ఫ్లయ్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో నేలకొరిగింది.

పంట నష్టం అంచనాలు పంపండి

గార్లదిన్నె: మండలంలోని మర్తాడు, కల్లూరు, ఇల్లూరు, కొప్పలకొండ, కేశవాపురం, కమలాపురం గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి పంట నష్టం వాటిల్లింది. అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, వ్యవసాయశాఖ ఏడీ వెంకటరాముడు, తహసీల్దార్ ఉషారాణి పై గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించి, బాధిత రైతులతో మాట్లాడారు. పంట నష్టం అంచనా వేసి నివేదికలు ప్రభుత్వంకు పంపాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మండలంలో 427 ఎకరాల్లో వరి, 17 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. ఏఓ సోమశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

బుక్కరాయసముద్రం: విద్యార్థులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఎంపీడీఓ తేజోత్స్న పేర్కొన్నారు. శనివారం ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కొండాపురంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం మస్తాన్‌వలి, ఎన్ఎస్ఎస్ పీఓ చిన్న పుల్లయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీసీ సహకారంతో పాఠశాల అభివృద్ధి

గుత్తి రూరల్: పేరెంట్స్ కమిటీ సహకారంతో పాఠశాలను మరింత అభివృద్ధి చేస్తామని హెచ్ఎం శ్రీధర్‌గౌడ్ తెలిపారు. శనివారం తొండపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ నాడు–నేడు పనుల ద్వారా పాఠశాలలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటశేషయ్య, రంగస్వామి, వేణుగోపాల్, శ్రీనివాసులు, శ్రీనివాసరావు, భారతి, నిర్మల పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు (గుత్తి ఆర్ఎస్)లో ఇటీవల వైఎస్సార్ సీపీ కార్యకర్త శేఖర్ అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద శనివారం రూ.10 వేలను మృతుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో 25వ వార్డు ఇన్‌చార్జ్ కొనకొండ్ల సూరి, సీనియర్ నాయకులు అబ్దుల్ గలీబ్, సచివాలయ సెక్రటరీ సుమలత, క్లస్టర్ వలంటీర్ అంజాద్ ఖాన్, వాలంటీర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటాం

బుక్కరాయసముద్రం: మండలంలో ఈదురు గాలులు, వర్షాలకు దెబ్బతిన్న పంటల రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. శనివారం కొట్టాలపల్లిలో ఈదురు గాలులు, వర్షాలకు దుబ్బతిన్న పంటలను పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, బుల్లే నారాయణస్వామి, కేశవరెడ్డి, ఆర్బీకే అధికారి రమాకాంత్, విరూపాక్షేశ్వరరెడ్డి, చంద్ర శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పామిడి: మండల కేంద్రంలో శనివారం వేకువజామున ఓ మోస్తరు వర్షం పడింది. పామిడితో పాటు వంకరాజుకాలువ, పామిడి స్టేషన్ తదితర గ్రామీణ ప్రాంతాల్లోని వరిపైరు నేల కొరిగింది. లోతట్టు ప్రాంతాలైన మదీనా కాలనీ, వెంగమనాయుడు కాలనీ, చైతన్యకాలనీ, వీకే ఆదినారాయణరెడ్డి కాలనీ, నాయీబ్రాహ్మణ కాలనీ, సీఎస్ఐ చర్చీ వీధి జలమయమయ్యాయి.

నకిలీ మందులు అమ్మితే చర్యలు

బుక్కరాయసముద్రం: నకిలీ మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఏడీ వెంకటరాముడు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ మందుల షాపులలో కాలం చెల్లిన మందులు అమ్మినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులు సక్రమంగా ఉంచు కోవాలన్నారు. అధిక ధరలకు మందులు అమ్మరాదన్నారు. మండలంలో పీఎం కిసాన్ ఈ–కేవైసీ చేయని వారు 1,919 మంది ఉన్నారని, వెంటనే పూర్తి చేసుకోవాలని సూచించారు. ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి ఉన్నారు.

పాల్ హ్యారీస్ విగ్రహావిష్కరణ

గుంతకల్లుటౌన్: రోటరీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు పాల్ హ్యారీస్ విగ్రహాన్ని రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ ఒమ్మిన సతీష్, మాజీ గవర్నర్ బాగ్‌సింగ్ పన్నూ ఆవిష్కరించారు. శనివారం రోటరీక్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సమాజ హితమే లక్ష్యంగా పాల్ హ్యారీస్ రోటరీ సంస్థను స్థాపించారన్నారు. భారతదేశంతో పాటు ఇతర దేశాల్లో రోటరీ నిర్వహిస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలను వారు కొనియాడారు. విగ్రహదాత, సీనియర్ రొటేరియన్ జీవీ.లక్ష్మణ్, రోటరీ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న శానిటరీ కార్యదర్శులపై చర్యలకు ఉపక్రమించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అధికారులకు సూచించారు. శనివారం చైర్‌పర్సన్ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు నాగరత్నమ్మ, పవన్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబు ఆయా వార్డుల్లో పారిశుధ్య లోపంపై ప్రశ్నించారు. తాత్కాలిక పద్ధతిన అదనంగా నియమించుకున్న 40 మంది పీహెచ్ వర్కర్లు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారని అడిగారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పొంతన లేని సమాధానాలివ్వడంతో చైర్‌పర్సన్ అసహనం వ్యక్తం చేశారు. శానిటరీ కార్యదర్శులతో సక్రమంగా పనిచేయించుకోకపోతే ఎలా? విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్ మాట్లాడుతూ 40 మంది కార్మికులు ఏయే వార్డుల్లో పనిచేస్తున్నారని సభ్యులడిగిన ప్రశ్నలకు అధికారులు ఎందుకు సమాధాన మివ్వట్లేదన్నారు. ఒక వార్డుకు సంబంధించి కార్యదర్శులు, పీహెచ్ వర్కర్లు, లైటింగ్, టర్న్‌కాక్, ఫిట్టర్ల పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన ఫార్మాట్లను ఆయా వార్డుల కౌన్సిలర్లకు అంజేయాలని వారు సూచించారు.

లారీ బోల్తా

గుంతకల్లు రూరల్: గుంతకల్లు–గుత్తి జాతీయ రహదారిపై లారీ బోల్తాపడింది. వివరాలు..హోస్పేట్‌కు చెందిన రంజాన్ అనే డ్రైవర్ నల్లమట్టి లోడ్‌తో ఉన్న లారీతో గుత్తి నుంచి బళ్లారికి బయలుదేరాడు. పాతకొత్తచెరువు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌కు ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలు కావడంతో అతడిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్రీడాకారులకు దుస్తుల అందజేత

యాడికి: కబడ్డీ క్రీడాకారులకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని గుడిపాడు వైఎస్సార్‌సీపీ నేత దండు రాముడు అన్నారు. శనివారం గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారులకు రూ.15 వేలు విలువైన దుస్తులు అందజేశారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గార్లదిన్నె: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.